క్లుప్తంగా

ప్రణాళికలతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్

ఉయ్యాలవాడ: ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని నంద్యాల డివిజన్ రిసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు పంచాయతీల అభివృద్ధి, సూచికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా ప్రజా ప్రతినిధులతో పాటు పంచాయతీ అధికారులు కూడా పర్యవేక్షించవలసిన అవసరం ఎంతైనా వుందన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించేందుకు వర్షన్ 2.0కు అప్‌డేట్ చేసిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, తహసీల్దార్ సువర్ణాదేవి పాల్గొన్నారు.

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ

నంద్యాల(న్యూటౌన్): అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరణనకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం తెలిపారు. ఈ పథకం కింద జూన్30 నుండి వేసిన అనధికార లే అవుట్ల ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుంలో సగం మాత్రమే చెల్లించి క్రమబద్ధీకరించుకొనే అవకాశం కల్పించిదన్నారు. ఈ ఏడాది అక్టోబర్ 24 వరకు దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు.

వెండి యజ్ఞోపవీతం బహూకరణ



అర్చకుడికి యజ్ఞోపవీతం అందజేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: ఆర్.జంబులదిన్నె గ్రామంలో వెలిసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి దాతలు వెండి యజ్ఞోపవీతం (జంధ్యం) బహూకరించారు. గ్రామానికి చెందిన కోన నారాయణరెడ్డి, సుధారాణి దంపతులు శ్రావణ మాసం పురస్కరించుకుని గురువారం రూ. 35 వేలు విలువ చేసే యజ్ఞోపవీతాన్ని స్వామి వారికి అందజేసినట్లు అర్చకులు లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమ, సింధూర అర్చనలు నిర్వహించారు.

వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నంద్యాల(అర్బన్): వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు కృషి చేయాలని ఆర్‌డీవో విశ్వనాథ్ ఆదేశించారు. వినాయక చవితి నిర్వహణపై గురువారం స్థానిక కార్యాలయంలో పలుశాఖల అధికారులతో ఆర్‌డీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అటంకాలు లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ పోలీసు వ్యవస్థ పకడ్బందీ చర్యలు చేపట్టి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీస్పీ మందజావళి, తహసీల్దార్ శ్రీనివాసులు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో మౌలాలిస్వామి జార్తలు

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం గ్రామంలో గురువారం రాత్రి మౌలాలిస్వామి జార్తలు నిర్వహించారు. గ్రామస్తులు కులమతాలకు అతీతంగా పీర్ల మఖానం చేరుకుని మౌలాలిస్వామిని దర్శించుకున్నారు. బాసికాలు, పూలదట్టీలు, గొడు గులు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

భక్తులకు వసతి కల్పన

శ్రీశైలంటెంపుల్: కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా హటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద యాత్రికుల సౌకర్యాల కేంద్రాలలో శుక్రవారం నుంచి భక్తులకు వసతి కల్పించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈఓ మాట్లాడుతూ భక్తుల వసతి కోసం రెండు బంకర్ బెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో బెడ్ రోజువారి అద్దె రూ.60 నిర్ణయించామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

శ్రీశైలంటెంపుల్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 16న శ్రీశైల ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులం వద్ద గోవులకు, గోవత్సవములకు (దూడలకు) శనివారం ఉదయం 9గంటలకు పూజాదికాలు ఉంటాయన్నారు. గోసంరక్షణశాలలో కూడా గోపూజ జరిపిస్తామన్నారు.

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

- స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు నంద్యాల ముస్తాబు
- ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన ఏర్పాట్లు
- వేడుకలు తిలకించేందుకు ప్రత్యేక గ్యాలరీ



స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైన నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానం



నంద్యాల: 79వ స్వాతంత్య్ర సంబరాలకు జిల్లా కేంద్రం నంద్యాల పట్టణం ముస్తాబైంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్య్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, స్వాతంత్య్ర సమర యోధుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు హాజరు కానున్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న స్వాతంత్య్ర వేడుకలను ప్రత్యక్షంగా తిలకించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రజలు, అధికారులు, వీఐపీలు, విద్యార్థులు, మహిళలు కూర్చునే విధంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో, గ్యాలరీల వద్ద తాగునీరు, అల్పాహారం, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన శకటాలను ప్రదర్శించనున్నారు. డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యానం, సూక్ష్మసేద్యం, సివిల్ సప్లయ్, అగ్నిమాపక శకటాల ప్రదర్శనలకు సిద్ధం చేశారు.

వేడుకలను విజయవంతం చేద్దాం..

శుక్రవారం ఉదయం నంద్యాల జిల్లా కేంద్రంలోని పీఎస్‌సీ - కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో 79వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో నిర్వహించే ఈ వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరిస్తారన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకల వివరాలు

- ఉదయం 9.05 గంటలకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ
- 9.10కు సాయుధ దళ పరిశీలన
- 9.20కు మంత్రి సందేశం
- 9.40కు సాయుధ దళాల కవాతు
- 9.55కు స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం
- 10.00 - వివిధ ప్రభుత్వ శకటముల ప్రదర్శన
- 10.30కు బాల బాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు
- 11.15కు అవార్డులు మరియు ప్రశంసా పత్రాల ప్రదానం
- 11.55కు ముఖ్య అతిథి వివిధ శాఖల స్టాళ్లు సందర్శన
- 12.00 గంటలకు జాతీయ గీతం ఆలాపనతో ముగింపు

నంద్యాల గాంధీ వారసునికి సత్కారం



సన్మానం చేస్తున్న దృశ్యం

నంద్యాల (వ్యవసాయం): రైతుల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేస్తున్న అంతర్జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కాదర్ బాద్ రవీంద్రనాథ్ సేవలు అమూల్యమైనవని రైతు సంఘం నాయకులు సూపుల రామచంద్రారెడ్డి అన్నారు. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా వివిధ రైతు సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో గురువారం భారతి సీడ్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయననను సత్కరించారు. స్వాతంత్య్ర సమరయోధుడు నంద్యాల మున్సిపాలిటీ అధ్యక్షులుగా 15 సంవత్సరాలు ఏకధాటిగా కొనసాగి నంద్యాల గాంధీగా పేరొందిన కాదర్ బాద్ నరసింగరావు కుమారుడు రవీంద్రనాథ్‌ను స్వాతంత్ర వేడుకలో భాగంగా సత్కరించుకోవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా నంద్యాలకు కాదర్ బాద్ కుటుంబం చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో రైతు నాయకులు మాట్లాడుతూ కాదర్ బాద్ రవీంద్రనాథ్ 90 సంవత్సరాల వయస్సులో కూడా రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏర్వ రామచంద్రారెడ్డి, తూము శివారెడ్డి,ఋషి కేశవరెడ్డి, రఫి,సుదర్శన్ , సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండె నిండా జెండా



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల క్రీడాభారతి ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగ ర్యాలీని విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు అయిన సందర్భంగా ఐకమత్యం దేశభక్తి జాతీయ గౌరవాన్ని పెంపొందించడం ప్రతిపౌరుడి బాధ్యతన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ ర్యాలీ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో క్రీడాభారతి సెక్రటరీ సుధాకర్, కుమార్, ఎన్‌సీసీ విద్యార్థులు పట్టణ ప్రముఖులు మురళీధర్, శివారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మెన్ సూర్యదేవర సుధాకర్, బాలచంద్రుడు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ ఐక్యూఏసీ కమిటీ ఏర్పాటు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా వీసీ, ఏఓలుగా రిజిస్ట్రార్, పరీక్షల విభాగం డీన్, పరిపాలన విభాగం డీన్, అకడమిక్ విభాగం డీన్, సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లను నియమించారు. డైరెక్టర్‌గా కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ డైరెక్టర్లుగా సిల్వర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లా క్రిష్ణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ కె.జీ మల్లికార్జున, సభ్యులుగా రాధారమణి (కేవీఆర్ కాలేజీ), బి.మసూదా వలి (ప్రభుత్వ పురుషుల కాలేజీ), సీహెచ్.నాగ సురేష్ (సిల్వర్‌జూబ్లీ కాలేజీ), ధర్మేందర్ (పురుషుల కాలేజీ), ఏబీఎల్ పావని (కేవీఆర్), ఆచార్య ఎస్.మన్సూర్ రెహ్మాన్ (సొసైటి), ఎస్.రాజశేఖర్ (ఫస్ట్ స్టెప్ టెక్నాలజీస్), పి.విజయ (ఏపీ టూరిజం), విజయకుమార్ రెడ్డి (సాయి డెకరేటర్స్), కురువ రమేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ బాంబే) కమిటీలో ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు




జనార్ధన స్వామికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్దన స్వామి ఆలయాల్లో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని పున:ప్రతిష్టించారు. మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు యంత్ర, విగ్రహ ప్రతిష్ట, శిఖర, ధ్వజ ప్రతిష్ట, ఆవాహిత దేవతా హోమం, బింబకళాన్యాసం, ప్రాణ ప్రతిష్ట, జలాధి హోమాలు, బలిప్రదానం, కూష్మాండబలి, గోదర్శన, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సొదరదిన్నె, వెలగటూరు, అమడాల గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, ఎల్వీ సుధాకర్‌రెడ్డి, బాల మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

కోవెలకుంట్ల: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం అరుణకుమారి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ.. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన రియా తబసుం, లీలామాధురి, ఆసియా బేగం సత్తా చాటి వెండి, రజత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. వారితో పాటు కోచ్ సుధీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



సత్తా చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కుందూలో తగ్గిన వరద ఉధృతి



ఉయ్యాలవాడ : కుందూనదిలో వరద నీటి ఉధృతి కొద్ది మేరకు గురువారం తగ్గుముఖం పట్టింది. నదీ తీరం వెంట వున్న 14 గ్రామాల్లో నీట మునిగిన విద్యుత్ మోటార్లు, ఎత్తు ప్రదేశాల్లో దిమ్మెలు ఏర్పాటు చేసుకున్న చోట పైకి కనిపిస్తున్నాయి. సుద్దమల్ల, ఉయ్యాలవాడ, నర్సిపల్లె, కాకరవాడ, రూపనగుడి, మాయలూరు, ఆర్.జంబులదిన్నె గ్రామాలలో రైతులు లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో వరి నాట్లు వేసే పనులను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ప్రస్తుతం కుందూనదిలో 25 నుండి 30 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల తగ్గించినట్లు కేసీ కెనాలు అధికారులు పేర్కొన్నారు. అలాగే పంట పొలాల్లో నిలిచిన వరద నీరు కూడా కొద్ది మేర తగ్గుముఖం పట్టింది.

అప్పుడు రూ. 6 వేలు ఇస్తామన్నారు.. ఇప్పుడు అనర్హత అంటున్నారు !

- దివ్యాంగ పింఛన్లలో కూటమి కోత
- 114 మందికి నోటీసులు అందజేత



శిరివెళ్ల: కూటమి ప్రభుత్వం అనర్హుల పేరుతో దివ్యాంగ పింఛన్ల కోతకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మండలంలో 40 శాతం కన్నా తక్కువ వికలత్వం గల వారికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు నోటీసులు అందజేస్తున్నారు. నోటీస్‌లు అందుకున్న నెల రోజుల్లోగా మళ్లీ ఎంపీడీఓకు అర్జీ పెట్టుకోవాలి. ప్రభుత్వం సదరం క్యాంపు ఏర్పాటు చేసినప్పుడు వెళ్లి 40 శాతం కన్నా ఎక్కువ వికలత్వం ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలి. అప్పటి వరకు పింఛన్ రాదు. మండలంలో శారీరక, చెవిటి, మూగ, అంధ వైకల్యం ఉన్న దివ్యాంగులు 799 మంది ఉన్నారు. వారిలో 16 గ్రామ సచివాలయాల్లో 114 మందికి 40 శాతం కన్నా వికలత్వం ఉన్నట్లు సచివాలయాలకు జాబితా పంపారు. పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసే పనిలో ఉన్నారు. సచివాలయాల వారీగా చేస్తే శిరివెళ్లలోని 4 గ్రామ సచివాలయాల పరిధిలో 227 పింఛన్లు ఉంటే అందులో 30 మందికి 40 శాతం కన్నా వికలత్వం ఉందని నోటీసులు ఇచ్చారు. గోవిందపల్లె 117కు 22, యర్రగుంట్ల 122కు 19, గుంప్రమాన్‌దిన్నె 48కి 6, జీనేపల్లె 31కి 4, చెన్నూరు 43కు 8 మంది, బోయలకుంట్ల 41కి 10, గంగవరం 21కి 5, గుండంపాడు 42కు 3, మహదేవపురం 40 మందికి గానుఏడుగురికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇదిలా ఉండంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ ద్వారా మంజూరైన పింఛన్ల మండలంలో 56 ఉన్నాయి. వాటిలో 90 శాతం పైగా వికలత్వం ఉంటేనే రూ. 15 వేల పింఛన్లకు అర్హులు. వాటిలో తక్కువ శాతం వికల త్వం ఉన్న వారిని తీసుకొనేవారిని సాధారణ వికలాంగ పింఛన్లలోకి మార్పు చేశారు. వారికి రూ. 6 వేల పింఛన్ల ఇవ్వనున్నారు. అలాగే మండలంలో మొదటి పరిశీలనకు పోని వారు 10 మంది దాకా ఉన్నారు. వారి పింఛన్లను ఈ నెల పంపిణీ చేయ కుండా పెండింగ్‌లో పెట్టారు. వారికి ఈ నెల 4వ తేదీ నుంచి 28 వరకు నంద్యాల ప్రభుత్వ వైద్య శాలలో పరిశీలన చేసే ప్రక్రియ మొదలైంది. కూటమి ప్రభుత్వ తీరుపై దివ్యాంగ పింఛన్‌దారులు మండిపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో నీకు రూ. 20 వేలు, నీకు రూ. 15 వేలు, నీకు రూ. 6 వేలు అంటూ ప్రచారం చేసిన కూటమి నేతలు ఇప్పుడు కోతల పేరుతో పేదలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

127 మందికి నోటీసులు

చాగలమర్రి: మండలంలో 127 మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధమైంది. మండలంలో ప్రభుత్వం పంపిణీ చేసే 697 దివ్యాంగ పింఛన్‌దారుల్లో 127 మందికి వికలత్వం 40 శాతం తక్కువగా ఉందని ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. చాగలమర్రి, ముత్యాలపాడు, నేలంపాడు, గడిగనూరు, మల్లేవేముల, డి.వనిపెంట, చింతలచెరువు, చిన్నవంగలి, శెట్టివీడు సచివాలయాల్లో పరిధిలో ఉన్న వీరికి గురువారం నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

దొంగ అరెస్ట్

చాగలమర్రి: నాలుగు రోజుల క్రితం మండల కేంద్రమైన చాగలమర్రిలో చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలచెరువు రస్తాలో నివాసం ఉంటున్న కొత్తపేట బషీరున్నీసా ఇంట్లో ఈ నెల 11వ తేదీ తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా బాధితురాలి బంధువు కమలూరు షరీఫ్ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. గురువారం మల్లెవేముల రస్తాలో ఉన్న నిందితుడిని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళిధర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ సురేష్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 4 తులాల బంగారు ఆభరణాలు, 56 తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. దొంగను కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

హైదరాబాద్‌లో ఆళ్లగడ్డ వాసి మృతి



లక్ష్మీనరసింహ(ఫైల్)

ఆళ్లగడ్డ: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆళ్లగడ్డకు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పట్టణ శివారులోని పడకండ్ల గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహ (56) సొంత పనిమీద హైదరాబాద్ వెళ్లాడు. మియాపూర్‌లో నడిచి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీనరసింహను వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మూల్యాంకనం పాత పద్ధతిలోనే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు మస్తాన్‌వలి

చాగలమర్రి: కూటమి ప్రభుత్వ తీరుతో ఉపాధ్యాయులు గందరగోళ స్థితిలో పడ్డారని ఎస్టీయూ మండల అధ్యక్షులు మస్తాన్‌బాషా అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ విధానంలో అసెస్మెంట్ బుక్స్ అనే ఒక కొత్త విధానాన్ని తీసుకు రావడంతో కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ విధానం బోధన సమయాన్ని హరించే విధంగా ఉందన్నారు. గతంలో పరీక్ష పేపర్లు ఇంటి వద్దరకి తీసువెళ్లి మూల్యాంకనం చేసే అవకాశం ఉండేదని, వందలాది పుస్తకాలను ఇంటికి మోసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి మాట్లాడుతూ.. మూల్యాంకనం చేసి మార్కుల నమోదు కూడా ఉపాధ్యాయులకు భారంగా పరిగణించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు పి.నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సురేశప్పా, అంబటి రాజశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, వై.శ్రీను, స్వామిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎన్ ప్రసాద్, పి.నరసింహులు, పుట్టాలయ్య, పీఎస్ హెచ్‌ఎం సి.శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: శ్రావణమాసం సందర్భంగా మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళ హారతులు చేపట్టారు. ఉదయం స్థానిక కల్యాణ మండపంలో మహానందీశ్వరస్వామి దంపతులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.



చిన్నకోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

గోస్పాడు: ఎం. కృష్ణాపురం గ్రామానికి చెందిన హుసేన్‌పీరా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారంతో ఎస్ఐ సుదాకర్‌రెడ్డి సిబ్బందితో గురువారం దాడి చేశారు. నిందితుడి వద్ద నుంచి 18 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఫోర్‌లైన్ క్రికెట్ విజేత వహబ్ జట్టు

చాగలమర్రి: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోర్‌లైన్ క్రికెట్ పోటీల్లో వహబ్ జట్టు విజేతగా నిలిచింది. గురువారం స్థానిక హీరో షోరూం సమీపంలోని మైదానంలో నిర్వహించిన ఫోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్‌ను పీడీ శ్రీనాథ్‌రెడ్డి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. 7 టీంలు పాల్గొనగా వహబ్ టీం ప్రథమ స్థానంలో, ద్వితీయ స్థానంలో మోహిద్దీన్ టీంలు నిలిచాయి. చెస్‌లో క్రీడలో గౌస్‌మోహిద్దీన్ టీం, సెటిల్‌లో కలాం టీం ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతలకు ఆగస్టు 15వ తేదీన స్వర్ణకారుల సంఘం కార్యాలయంలో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎస్.మహమ్మద్ గౌస్ తెలిపారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు డి.గౌస్‌బాషా, ట్రెజరర్ సాదిక్‌వలి, సభ్యులు కె.అబ్దుల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పీడీ శ్రీనాథ్‌రెడ్డి





